అంబరాన్నంటిన సంబరం





ఈశ్వరీదేవిమఠం క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు, మహాప్రసాదం పంపిణీ చేస్తున్న మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం : శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవ సంబరం అంబరాన్నంటింది. బ్రహ్మంగారిమఠం భక్తజన సంద్రంగా మారింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయ జయ ధ్వానాలతో అలరారింది. జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు రోజూ కమనీయంగా జరిపారు. ఈ నెల 14 నుంచి 19 వరకు ఉత్సవాలు చేపట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్ర దినమైన ఆరాధన రోజు ఈ నెల 17న లక్షలాది మంది భక్తులు వచ్చారని నిర్వాహకుల అంచనా. వారు స్వామి సజీవ సమాధిని దర్శించుకుని తరించారు. 'శరణమయ్యా.. బ్రహ్మయ్యా' 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని దీవించయ్యా..' అంటూ వేడుకున్నారు. రథోత్సవం రోజు అధిక మంది జనం వచ్చారు. వారు వీర బ్రహ్మ జై, గోవిందమాంబ జై అని నినదించారు. 'బ్రహ్మ' నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. పురవీధుల్లో ఎక్కడ చూసినా భక్తులే కనిపించారు. మాఢ వీధులు కిటకిటలాడాయి. చాలా మంది ఉత్సవాల ప్రారంభానికి ముందే ఇక్కడికి వచ్చి గదులు అద్దెకు తీసుకుని ఉన్నారు. వారు ఆరు రోజుల పాటు ఇక్కడ ఉండి ఆరాధనోత్సవాలను కనులారా తిలకించి ఆనంద భరితులయ్యారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిని ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి(నాని), మార్కెట్ చైర్మన్ జి.వీరరాఘవరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆరాధన ఉత్సవాల సందర్భంగా స్వామి దర్శనానికి రావడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.మఠం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, నాయకులు పాలరామిరెడ్డి, దుగ్గిరెడ్డి, పసుపులేటి వెంకటేష్, సోమయ్య, జోగయ్య, ఆలీవర్ తదితరులు పాల్గొన్నారు.

మాలధారులతో కళకళ

గురుదేవుడి మాలధారులతో బ్రహ్మంగారిమఠం కళకళలాడింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు మాల ధరించారు. అర్ధమండల, మండల దీక్ష ధరించిన భక్తులు భారీగా వచ్చారు. కొందరు ఉత్సవాలకు ముందే చేరుకున్నారు. మరికొందరు ఉత్సవాల వేళ వచ్చారు. ఇరుముడి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వారి కషాయ వస్త్రాధారణతో పురవీధులు కళకళలాడాయి.

తలనీలాల సమర్పణ

అధిక సంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెలిసో, తెలియకో చేసిన తప్పులు వెంట్రుకలను ఆశ్రయించి ఉంటాయని ఆర్యోక్తి. అందుకే తమ తలనీలాలను స్వామికి సమర్పించుకుంటే తొలగుతాయని నమ్మకం. అందుకే కొందరు పూర్తిగా, మరి కొందరు మూడు కత్తెరల ద్వారా తలనీలాలు సమర్పించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

భక్తుల కోసం దేవదాయ శాఖ, ఆలయ అధికారులు, స్వామి శిష్యులు భారీ ఏర్పాట్లు చేశారు. వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజీ, మేనేజర్ ఎస్.ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లు నెలకొల్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ వంతు సౌకర్యాలు కల్పించారు. మఠం తరపున నిత్యాన్నదానం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. దాతలు విరివిగా అన్నదానం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

ఈశ్వరీదేవిమఠంలో..

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, కుంకుమార్చన తదితరాలు చేపట్టారు. మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహాప్రసాదం వినియోగ కార్యక్రమం నిర్వహించారు. మహాప్రసాదానికి పులివెందుల నియోజకవర్గం లోపట్నూతల గ్రామానికి చెందిన పుల్లకూర వెంకటపతి, అచ్చమ్మ, రామయ్య, పార్థసారథివీరుడు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తుల కోసం సౌకర్యాలను ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు.

అచలానందస్వామి ఆశ్రమంలో..

మండల పరిధి తోట్లపల్లిలోని అచలానందస్వామి ఆశ్రమంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ, కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 19 వరకు ఆరు రోజులపాటు ఉత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిని బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి రూ.80,116, రెండో బహుమతిని ఎంపీపీ వీరనారాయణరెడ్డి రూ.60,116, మూడవ బహుమతి చెంచయ్యగారిపల్లెకు చెందిన ముదుమాల పోలిరెడ్డి రూ.40,116, నాలుగవ బహుమతిని తోట్లపల్లె సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మీదేవి రూ.20,016, ఐదో బహుమతిని గంగిరెడ్డిపల్లె ఎంపీటీసీ పోలు అంకిరెడ్డి, పోలు రవిభాస్కర్‌రెడ్డి రూ.10,116లను అందజేశారు. ఈ నగదులను గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు అందించారు. కార్యక్రమాలను సద్గురు అచలానందస్వామి ఆశీస్సులతో పీఠాధిపతులు శ్రీ విరజానందస్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములను దర్శించుకుని తరించారు.



బ్రహ్మంగారిమఠం మాఢ వీధిలో కిక్కిరిసిన భక్తజనం



శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, నాయకులు



సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

క్లుప్తంగా


వేసవి శిక్షణ తరగతులు



దేశనాయకుల చరిత్ర చెబుతున్న నిర్మలజ్యోతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం బాలబాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి విద్యార్థులకు స్వాతంత్య్ర సమర యోధుల గురించి, వారు చేసిన త్యాగం, దేశానికి చేసిన సేవ గురించి వివరించారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్యారమ్స్, ఖోఖో, జిరాఫీ చెస్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి, రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు



రెడ్డికొట్టాల పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాశినాయన : విద్యార్థులకు పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలుగు పండిట్ మహేష్‌కుమార్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్‌లు తెలిపారు. ఆదివారం మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులచే గ్రంథాలయ పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠశాలలోని గ్రంథాలయ పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి ఇంటి వద్ద చదవాలన్నారు. పుస్తక పఠనం వలన విద్యార్థులు విజ్ఞానవంతులై ఉత్తమ పౌరులుగా తయారవుతారని అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలాం, మహాత్మాజ్యోతిరావుపూలే, నెహ్రూ వంటి మహానుభావులు పుస్తకపఠనంతోనే మహానుభావులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

గుండె జబ్బులను అశ్రద్ధ చేయొద్దు



గుండె పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : గుండె జబ్బులను అశ్రద్ధ చేయరాదని కార్డియాలజిస్టు డాక్టర్ పాతకోట శ్రీనాథరెడ్డి తెలిపారు. నెహ్రూరోడ్డులోని లక్ష్య కార్డియాక్, కంటి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 46 మంది గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 21 మందికి ఈసీజీ, 10 మందికి గుండె స్కానింగ్‌లను ఉచితంగా నిర్వహించారు. అలాగే డాక్టర్ హరిత 32 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో ప్రతి నెలా మూడవ ఆదివారం ఉచితంగా గుండె, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 38 వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లాసెట్‌పై అవగాహన



మాట్లాడుతున్న తవ్వా సురేష్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నందిని క్లాత్‌మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జేవీవీ, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో లా సెట్‌పై అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ పరీక్ష, ప్రిపరేషన్ విధానం, సిలబస్‌పై అవగాహన కల్పించారు. కరెంట్ అఫైర్స్‌ను సివిల్ సర్వీస్ ఫ్యాకల్టీ రవిశంకర్, రీజనింగ్‌ను పీవీఆర్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ రమణ, స్టడీ ఆఫ్ లా సబ్జెక్ట్‌ను న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వీనర్ కిరణ్, హరితలు అభ్యర్థులకు వివరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు, పూర్వ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకుడు మురళీ గుప్త, పట్టణ కార్యదర్శి సునీత, డాక్టర్ విజయనాగేంద్ర, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

బాటిల్‌లో పెట్రోలు, డీజిల్ వేయవద్దు

బి.కోడూరు : కంటైనర్లు, బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ వేయవద్దని పెట్రోలు బంకు నిర్వాహకులను ఎస్‌ఐ జయరాములు ఆదేశించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు వాహనాల్లోనే ఇంధనం నింపాలని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలపై ఉల్లంఘిస్తే ఆయిల్ బంకుల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు అన్ని బంకుల యజమానులకు నోటీసులు పంపించినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ తర్వాత పలు హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఆంక్షలు విధించినట్లు ఆయన తెలిపారు.

ఎయిడ్స్ మృతుల కుటుంబాల బాధను నయం చేద్దాం



ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



బద్వేలు అర్బన్ : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మైదుకూరు : ఐసీటీసీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ

ప్రొద్దుటూరు క్రైం : ఎయిడ్స్ మృతుల కుటుంబాల బాధను నయం చేద్దామని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్‌తో మృతి చెందిన వారి ఆత్మశాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేస్తూ క్యాండిల్ ర్యాలీలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌కి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో సమాజ ప్రమేయాన్ని సమీకరించాల్సిన అవసరం ఉందన్నారు. 'మనం హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో మరణించిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియచేద్దాం.. వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం' అనే నినాదాన్ని ప్రభుత్వం ఈ సంవత్సరం తీసుకొచ్చినట్లు తెలిపారు. హెచ్ఐవీ నిర్మూలనలో ఎయిడ్స్ బాధితులకు అందించే సేవలు ఎంతో ప్రాముఖ్యాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్లు సూర్య నాగలక్ష్మి, అనూష, ఐసీటీసీ కౌన్సిలర్ నాగేంద్ర, ఏఆర్‌టీ సిబ్బంది సాధిక్‌బాషా, గోవిందరెడ్డి, చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్, ఏఆర్‌టీ సిబ్బంది హుస్సేన్‌బాషా, ఫాజియా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

మండలంలోని కామనూరు పీహెచ్‌సీలో వైద్యాధికారి హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో వాసవి సర్కిల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీను, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, చంద్రకళ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, టీబీ సూపర్‌వైజర్ హుస్సేన్‌బాషా, హెల్త్ అసిస్టెంట్‌లు లక్ష్మీనారాయణ, సుబ్బయ్య, చంద్ర, ఆరోగ్య కార్యకర్తలు అరుణ, దీప్తి, ఆశా కార్యకర్తలు కరుణ, అనురాధా, విజయ, ప్రసన్న, వరలక్ష్మి, బాగ్యమ్మ, జ్యోతి, శ్రీదేవి, చెంచమ్మ, సాలమ్మ, పుష్పలత, విజయ, రహమతున్నీసా, ఖజాబీ పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు

బద్వేలు అర్బన్ : ఎయిడ్స్ సోకిన వారిపై వివక్ష చూపొద్దని సురేంద్రనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ క్యాండిల్‌లైట్స్‌డేను పురస్కరించుకుని స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్యసిబ్బందితో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండి, ఎయిడ్స్ బారిన పడకుండా ఉండాలని కోరారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల మానవత్వంతో మెలగాలని కోరారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి సోకి మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ఐసీటీఎస్ కౌన్సిలర్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీటీసీ ఆధ్వర్యంలో..

మైదుకూరు : హెచ్ఐవీ బాధితుల పట్ల ఎవరూ వివక్ష చూపవద్దని ఐసీటీఎస్ కౌన్సిలర్ ఎంవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం మైదుకూరులో అంతర్జాతీయ హెచ్ఐవీ మృతుల స్మారక దినోత్సవం సందర్భంగా మైదుకూరు ప్రభుత్వ ఆస్పత్రి అనుబంధ ఐసీటీసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ మృతులకు నివాళి అర్పిస్తూ కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు పోవాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్న లోకనాథం, రంగస్వామి, నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు పోవాలని విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి మామిళ్ల వెంకటరంగయ్య గారి లోకనాథం పద్మశాలి పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో పద్మశాలీయ అభ్యుదయం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని కష్టపడి చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాట వేసుకోవాలన్నారు. ప్రతిభ గల పద్మశాలీయ విద్యార్థులకు పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజి హెచ్‌ఓడీ డాక్టర్ అవ్వారు వెంకటరంగస్వామి పద్మశాలి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని సాధ్యమైనంతగా తగ్గించాలని, విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటమికి కుంగి పోకుండా కష్టపడి విజయం సాధించాలన్నారు. సివిల్స్, గ్రూప్స్‌లో ఉద్యోగాలు సాధించి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు మాట్లాడుతూ 26 ఏళ్లుగా పద్మశాలీయ విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతల సహకారంతో ప్రజ్ఞ ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామన్నారు. 10వ తరగతి మంచి, ఇంటర్‌లో ప్రతి గ్రూపులో ఉత్తమ మార్కులు సాధించిన, ఎంసెట్, నీట్, మెడిసిన్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికతో సత్కరిస్తున్నామన్నారు. అలాగే సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, వేసవిలో చలివేంద్రం, చలికాలంలో పేదలకు దుప్పట్ల పంపిణీ, కార్తీక మాసంలో వనభోజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. పేద ప్రతిభ గల విద్యార్థులకు ఉన్నత చదువుకు సంఘాన్ని సంప్రదిస్తే తమ వంతు సహకారం అందిస్తామన్నారు. రూ.2.72 లక్షలను 84 మంది విద్యార్థులకు నగదు ప్రతిభా పురస్కారాలుగా అందించారు. అలాగే 60 ఏళ్లు దాటిన 12 మంది చేనేతలను సత్కరించి ఆర్థిక సహకారం పంపిణీ చేశారు. డాక్టర్ సత్యప్రసాద్, ఆల్‌ఇండియా పద్మశాలీయ సంఘం కార్యదర్శి నందం లక్ష్మణ కుమార్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు భీమునిపల్లి వెంకటసుబ్బయ్య, పద్మశాలీయ అభ్యుదయ సంఘం నాయకులు సాధు అశోక్, చెన్నా చంద్రబాబు, వద్ది నాగరాజు, అవ్వారు శ్రీనివాసులు, కోటా సంజీవరాయుడు, జింకా శ్రీనివాసులు, భోగా ఆనంద్, జింకా సుబ్రహ్మణ్యం, అవ్వారు తాండవకృష్ణ, బొర్రా మునిస్వామి, పోలంకి వరదరాజులు, వెంకట సాయికృష్ణ పాల్గొన్నారు.

ఆదర్శనీయం.. పుచ్చలపల్లి సుందరయ్య జీవితం



పోరుమామిళ్ల : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు



బద్వేలు అర్బన్ : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



మైదుకూరు : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న డాక్టర్ నరసింహారెడ్డి, సత్యనారాయణ

పోరుమామిళ్ల : కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటితరం యువతకు, రాజకీయ నేతలకు ఆదర్శనీయమని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం జీబీనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భైరవప్రసాద్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యునిగా సుదీర్ఘకాలం పని చేసిన సుందరయ్య సైకిల్‌పైనే పార్లమెంటుకు వెళ్లేవారన్నారు. తన పేరులో రెడ్డి పదాన్ని తొలగించుకొని కులతత్వానికి దూరమయ్యారని, బిడ్డలు పుడితే స్వార్థం తలెత్తుతుందని, సుందరయ్య దంపతులు బిడ్డలు లేకుండా ఆపరేషన్ చేయించుకున్నారన్నారు. విలువలకు మారు పేరు సుందరయ్య అని, అలాంటి నేతలు నేడు కనిపించరన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు గౌసియా, బీబీ, లక్షుమ్మ, దుగ్గయ్య, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం కావాలి

బద్వేలు అర్బన్ : నేటి తరం కమ్యూనిస్టు నాయకులకు, సభ్యులకు సుందరయ్య జీవితం ఆదర్శం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గండికోట శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రరాష్ట్రంలో మొట్టమొదటగా భూ పోరాటాలను నెలకొల్పి పేదలకు భూ పంపిణీకై కృషి చేసిన వ్యక్తి అన్నారు. గ్రామస్థాయి వ్యక్తులను చైతన్య పరిచి వారిని ఉద్యమాల బాట పట్టించి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తన తుది శ్వాస విడిచే వరకు కార్మికుల పక్షాన, పేదల కోసం పోరాడారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు చిన్ని, కొండయ్య, మోక్షమ్మ, నాగార్జున, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

మైదుకూరు : ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్యకు సీపీఎం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళి అర్పించారు. స్థానిక సుందరయ్య నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శివకుమార్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని కమ్యూనిస్టు గాంధీగా పేరు పొందారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు గురయ్య, పోలయ్య, రాజా, వాసు, రాయప్ప, సుధాకర్, లక్ష్మీదేవి, ఎస్ఎఫ్ఐ నాయకుడు రాహుల్ పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి

ప్రొద్దుటూరు : సమ సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని డాక్టర్ నరసింహారెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక మమత నర్సింగ్ హోంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించి తన యావదాస్తిని పేదల కోసం ఖర్చు చేశారని తెలిపారు. సుందరరామిరెడ్డిగా ఉన్న పేరును రెడ్డిని తొలగించి సుందరయ్యగా పిలిపించుకునేవారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ ప్రాజెక్టులు నిర్మించాలని ప్రభుత్వానికి ఆయన నివేదిక అందించారన్నారు. కార్యక్రమంలో లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, సర్వేశ్వరి, లక్ష్మిదేవి, బాబు, చెన్నారెడ్డి, ఝాన్సీ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు



దుంపలగట్టులో పోలిసింగ్ నిర్వహిస్తున్న సీఐ, పోలీసులు

ఖాజీపేట : ఎన్నికల తరువాత గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని ఖాజీపేట సీఐ రామాంజులు హెచ్చరించారు. ఖాజీపేట మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన దుంపలగట్టు, ముత్తులూరు పాడు గ్రామాల్లో పోలీసింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం అన్నారు. దాడులు, ప్రతి దాడులు చేసుకోవడం సమంజసం కాదని అన్నారు. దీనివల్ల మీ కుటుంబాలే నష్టపోతాయని అన్నారు. కేసుల వల్ల కోర్టు చుట్టు తిరుగుతూ విలువైన జీవితం నష్టపోతారని అన్నారు. ఎవరూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని అన్నారు. ప్రశాంత గ్రామాల్లో అలజడి మంచిది కాదని అన్నారు. పోలీస్ ప్రత్యేక బందోబస్తు ఉందని, ఏ సమస్య వచ్చినా పోలీసుల చర్యలు వేగంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పోలీసుల కృషి ప్రశంసనీయం

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాటలను వక్రీకరించారు
- మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ప్రొద్దుటూరు పోలీసుల కృషి ప్రశంసనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతో నిబద్ధతతో పని చేయడం వల్లనే ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటన కూడా చోటు చేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. అలాగే కౌంటింగ్ ముగిసిన తర్వాత కూడా పోలీసులు ఇదే విధంగా పని చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాటలను రెండు పత్రికలు వక్రీకరించి రాశాయన్నారు. శనివారం ఎమ్మెల్యే బైక్ షోరూం ప్రారంభోత్సవానికి వెళ్తుండగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి తమ పార్టీ కార్యకర్త ఒకరు ఫోన్ చేశాడన్నారు. దీంతో ఎమ్మెల్యే రాచమల్లు, తాను స్టేషన్‌కు వెళ్లామన్నారు. అక్కడ ఎమ్మెల్యే సీఐతో మాట్లాడుతూ.. 'చిన్న చిన్న కార్యకర్తలను కౌన్సెలింగ్‌కు తీసుకొని రావడం కంటే తన లాంటి ఎమ్మెల్యే అభ్యర్థులు, ద్వితీయ శ్రేణి నాయకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తే బాగుంటుందని' సూచించారన్నారు. కేవలం రెండు నిమిషాలు మాత్రమే స్టేషన్ బయట నిల్చొని ఎమ్మెల్యే సీఐతో మాట్లాడి వచ్చారన్నారు. అయితే దీనిపై కొన్ని పత్రికల్లో వక్రీకరించి రాయడం బాధాకరమన్నారు. మా వాళ్లను స్టేషన్‌కు పిలిపిస్తే మరో తాడిపత్రి అవుతుందని తాము చెప్పినట్లు పత్రికల్లో రాశారన్నారు. ఇందులో ఎలాంటి నిజం లేదని, పూర్తిగా కల్పితమని తెలిపారు. కౌంటింగ్ రోజు గానీ, తర్వాత గానీ చిన్న పాటి అవాంఛనీయ సంఘటన కూడా తమ వైపు నుంచి జరగదన్నారు. అవతలి వైపు వాళ్లు కవ్వింపు చర్యలకు పాల్పడినా తాము పట్టించుకోబోమని, ఓర్చుకొని వెళ్తామని తెలిపారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గెలవడంతోపాటు తమ పార్టీ తిరిగి అధికారంలోకి రాబోతోందన్నారు. ఇలాంటి తరుణంలో తమ వైపు నుంచి ఎలాంటి సంఘటనలు జరగబోవని ఆయన అన్నారు. సమావేశంలో కౌన్సిలర్ పిట్టా బాలాజీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నూరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి